క్లుప్తంగా

వేగంగా డేటా నమోదు



నర్సాపూర్‌లో డేటా నమోదును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో డేటా నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి తీసుకున్న అభయహస్తం దరఖాస్తుల డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని చెప్పారు. డేటా నమోదు ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డేటా నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకున్నామని, తాను నిరంతరం పర్యవేక్షిస్తున్నానని వివరించారు.

యువత క్రీడల్లో రాణించాలి



టీషర్టులు అందిస్తున్న సర్పంచ్ దంపతులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని గౌతాపూర్ సర్పంచ్ స్వరూప అన్నారు. మండలంలోని గౌతాపూర్ గ్రామ యువకులకు ఆమె రాష్ట్ర ప్రభుత్వం అందించిన టీషర్టులు, క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ.. మైదానాల్లో క్రీడలు ఆడడంతోనే శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. నేటి యువత ఎక్కువగా మొబైల్స్‌తో కాలం గడుపుతూ అనారోగ్యాలకు, మానసిక రుగ్మతలకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు ప్రశాంత్, జిన్నా, శ్యాం, కృష్ణ, సుధాకర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఖాళీలు

వెల్దుర్తి(తూప్రాన్): కేజీబీవీ పాఠశాలలో హెడ్ కుక్, నైట్ వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఎస్‌ఓ ఫాతిమా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఖాళీల భర్తీకి మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్ కావడంతో పాటు మండలానికి చెందిన మహిళలు ఈ నెల 18 లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు అప్లికేషన్ ఫారంతో పాటు పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు జతపరచాలని సూచించారు.

విద్యార్థుల గుర్తింపు సర్వే



మల్కాపూర్‌లో విద్యార్థులతో ఐఈ సీఎంఓ సతీశ్‌కుమార్

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల గుర్తింపు సర్వే కొనసాగుతోంది. సోమవారం మండల పరిధిలోని మల్కాపూర్, గట్టుకింది తాండా పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల వివరాలను జిల్లా ఐఈ సీఎంఓ సతీష్‌కుమార్ పరిశీలించారు. అనంతరం సర్వే వివరాలను ఐఈఆర్‌పీలు రవి, రాజులను అడిగి తెలుసుకున్నారు. ఆయా పాఠశాలల్లో గుర్తించిన పిల్లలను యూడైస్ పోర్టల్, ప్రభంద్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయమని హెచ్‌ఎంలు ప్రసూన, సంపత్‌లకు సూచించారు. సర్వేలో గుర్తించిన విద్యార్థులను ఆయా పాఠశాలల్లో అడ్మిషన్ చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు.

విధులపై బాధ్యతగా ఉండాలి



నర్సాపూర్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే సంఘం నాయకులు

నర్సాపూర్: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులపై బాధ్యతగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హితవు పలికారు. సోమవారం ఆల్ ఇండియా బంజారా ఎంప్లాయిస్ సేవ సంఘ్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో తయారు చేసిన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె బంజారా ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చాందిరాం, సామ్యానాయక్, ఇతర ప్రతినిధులు తారాసింగ్, ధన్‌సింగ్, రమేష్, రమేశ్, చక్రు, పుణ్య, రాములు, భీమ్లా తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు అక్షింతలు



నార్సింగి మండల కేంద్రంలో న్యాయవాది కృష్ణారెడ్డికి అక్షింతలను అందిస్తున్న సత్యం

చిన్నశంకరంపేట(మెదక్): అయోధ్య శ్రీరామ అక్షింతలు గడప గడపకు చేరేలా రామ భక్తులు బాధ్యత తీసుకొని ముందుకు సాగాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. సోమవారం నార్సింగి మండల కేంద్రంలో ప్రముఖ న్యాయవాది తూముల కృష్ణారెడ్డి గృహంలో ఆయనకు శ్రీరాముడి అక్షింతలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 వరకు ఆయా గ్రామాల్లో ప్రతీ గడపకు శ్రీరాముడి అక్షింతలు చేరేలా రామ భక్తులు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, పంచాయతీ సభ్యుడు దాయం నరేశ్, తపాస్ మండలాధ్యక్షుడు మల్లేశం ఉన్నారు. మండలంలోని జంగరాయి గ్రామంలో శ్రీరామతీర్థ ట్రస్ట్ అధ్వర్యంలో అయోధ్య అక్షింతలను సంప్రదాయ పద్ధతిలో ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో శ్రీరామతీర్థ ట్రస్ట్ సభ్యులు భాగారెడ్డి, శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

రుస్తుంపేటలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేట గ్రామంలో అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ భాస్కర్‌రాజు, శివశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు, శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని కర్నాల్‌పల్లిలో అయోధ్య అక్షింతల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి నర్సింలు, సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ కొనసాగుతోంది. పేట ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు కందుకూరి రవీందర్‌లు ఇంటింటికీ తిరుగుతూ అక్షింతలను అందజేశారు. ఈ నెల 22న సాయంత్రం అందరూ తమ ఇళ్లలో 5 దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ రామతీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు సీతారాం, సతీశ్‌గౌడ్, అన్నారం మురళి, సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: రుస్తుంపేటలో..



చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయిలో..



చేగుంట(తూప్రాన్): కర్నాల్‌పల్లిలో..



రామాయంపేటలో ..



చిలప్‌చెడ్(నర్సాపూర్): అంతారంలో అయోధ్య అక్షింతలతో సర్పంచ్ ఆశోక్‌గౌడ్



పెద్దశంకరంపేటలో అక్షింతలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

నర్సాపూర్ అభివృద్ధికి కృషి



నయిమొద్దీన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్, నాయకులు

నర్సాపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి తన శాయశక్తుల కృషి చేస్తానని ఇన్‌చార్జి చైర్మన్ నయిమొద్దీన్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానని, వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపాలిటీలోని కౌన్సిలర్లందరిని కలుపుకొని పోయి పట్టణ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. కాగా మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఆ రాజీనామాను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆమోదించారని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ చెప్పారు. మున్సిపల్ నిబంధనల మేరకు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా వైస్ చైర్మన్ నయిమొద్దీన్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నామని ఆయన వివరించారు. అనంతరం నయిమొద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు.

పలువురు నాయకుల శుభాకాంక్షలు

నర్సాపూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా నయిమొద్దీన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను కమిషనర్ వెంకటగోపాల్, నాయకులు, కౌన్సిలర్లు పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గోపి, శేఖర్, సత్యంగౌడ్, బాల్‌రెడ్డి, మహ్మద్, భిక్షపతి, షేక్ హుస్సేన్, ప్రసాద్, రాకేశ్‌గౌడ్, దావూద్, నగేశ్, ఆంజనేయులుగౌడ్, సాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మురళీయాదవ్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, పంబల్ల లలిత, సునీత, రాంచందర్, సురేశ్, రాజేందర్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు

ఎమ్మెల్యేను కలిసిన ఇన్‌చార్జి చైర్మన్

నర్సాపూర్: మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్మన్ నయిమొద్దీన్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, రాంచందర్, బాల్‌రెడ్డి, సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, మహ్మద్, భిక్షపతి, దావూద్, నగేష్, ఆంజనేయులుగౌడ్ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సోమవారం మొక్కజొన్న పంటలను రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకురాలు వసంత సుగుణ పరిశీలించారు. ఈ మేరకు నస్కల్ గ్రామంలోని పలు రైతులకు మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉండడాన్ని గమనించిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకినట్లయితే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని తెలిపారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కావేరి, రైతులు దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ గుప్తాకు న్యాయం చేయండి



గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, గ్రామస్తులు

శాంతియుతంగా రైతుల నిరసన

నర్సాపూర్ రూరల్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తీసుకొని రైతులను ఆదుకున్న రైస్ మిల్ వ్యాపారి శ్రీధర్ గుప్తాకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని కాగజ్ మద్దూర్ రైతులు, గ్రామస్తులు కలిసి గాంధీ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హాయంలో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని చెప్పడంతో రైస్‌మిల్ వ్యాపారి శ్రీధర్ గుప్తా నర్సాపూర్ నియోజకవర్గంలోని రైతుల నుంచి పెద్ద ఎత్తున తడిసిన ధాన్యాన్ని తీసుకున్నారన్నారు. తడిసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పజెప్పేందుకు నర్సాపూర్, కౌడిపల్లి మండలం తునికి, మక్త మాసానిపల్లిలోని గోదాముల్లో బియ్యం భద్రపరచాడు. ఆ బియ్యం నాణ్యతగా లేవని ప్రభుత్వం తీసుకోకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. నేటికీ మూడు గోదాముల్లో సుమారు 40 కోట్లకు పైగా విలువ ఉన్న బియ్యం అలాగే ఉన్నాయన్నారు. రైతులను ఆదుకున్న ఆయనకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, మాజీ సర్పంచ్ శంకరయ్య, రైతులు మన్మధ రెడ్డి, మల్లేశం, కిష్టయ్య, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి: పీఆర్టీయూ

వెల్దుర్తి(తూప్రాన్): పీఆర్టీయూ మాసాయిపేట మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ యాదగిరి, డిప్యూటీ తహసీల్దార్ చరణ్‌సింగ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ముంతాజ్‌అలీ వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు హరిరంజనశర్మ, నవీన్ మాట్లాడుతూ.. టెట్ లేకుండా ప్రమోషన్‌లు, బదిలీలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. బదిలీ ఉత్వర్వులు పొంది రిలీవ్‌కాని ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా పీఆర్టీయూ తరఫున కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, విజయసేనరెడ్డి, కృష్ణకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించామని పీఆర్‌టీయూటీఎస్ మండలాధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ వినోద రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం వేదశ్రీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గురివి నాయుడు, రాష్ట్ర నాయకుడు అనిల్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా నాయకుడు సర్వన్ పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): పీఆర్టీయూ టీఎస్ వాల్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను ఎంఈఓ బుచ్చానాయక్, శివ్వంపేట్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రంలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దయానందరెడ్డి, రాష్ట్ర కేజీబీవీ అధ్యక్షురాలు స్వరూపరాణి, మండల ఉన్నత పీఆర్టీయూ మండలాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంశీ, అసోసియేట్ సభ్యులు గోపాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్, స్వామి, రామచంద్రారెడ్డి, మానస, జిల్లా కార్యదర్శి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం సూరారం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వారిలో జెడ్పీపాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డి, ఎస్‌టీటీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింలు, శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి బి.ప్రవీణ్, శివకృష్ణ, రవి, రాజు, సురేశ్, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, సంతోశ్, మహేశ్ పాల్గొన్నారు.



వెల్దుర్తిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ యాదగిరి, ఉపాధ్యాయులు



శివ్వంపేట(నర్సాపూర్): క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



చేగుంటలో ..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రం వద్ద పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంఈఓ బుచ్యానాయక్, మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకట్‌రాంరెడ్డి, అమరశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయసేనారెడ్డి, హరిరంజన్‌శర్మ, మధుసూదన్‌రావు, గౌస్, వేణు, ప్రణయ్, శంకర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్

నర్సాపూర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకలతో అనేక మంది పేదలకు లబ్ధి చేకూరిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని మంతూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంకేవైసీ, ఆయుష్మాన్ భారత్, జాతీయ ఉపాధి హామీ, ఉజ్వల గ్యాస్, ఆయా పథకాలపై ఇప్పటివరకు లబ్ధి పొందిన వారి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘసాని సురేశ్, మాజీ గొర్ల కాపారి అధ్యక్షుడు రాజయ్య యాదవ్, కౌన్సిలర్ బుచేష్ యాదవ్, రాజేందర్, రమణారావు, నగేశ్, శ్రీనివాస్ గుప్తా, దేవేందర్ యాదవ్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని భీమ్‌రావుపల్లి గ్రామంలో సోమవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉజ్వలగ్యాస్, కిసాన్ సమ్మాన్‌నిధి, ఆయుష్మాన్ భారత్, కిసాన్ క్రెడిట్ కార్డు, జన్‌ధన్ ఖాతాలు, బీమా పథకాలు తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు మేలు చేశాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి, దుబ్బాక నియోజవర్గ బీజేపీ కో ఆర్డినేట్ గోవింద్ పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: మాట్లాడుతున్న బీజేపీ నాయకులు




చిన్నశంకరంపేట(మెదక్): భీమ్‌రావుపల్లిలో..

విరిగిన స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెదక్ - జోగిపేట ప్రధాన రహదారి పక్కన ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.దీంతోవిద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు.



రోడ్డు పక్కన విరిగిపడ్డ విద్యుత్ స్తంభం, తెగిపడ్డ తీగలు



హరీశ్‌రావుకు జ్ఞాపికను అందిస్తున్న కిషన్‌రావు

మాజీ మంత్రిని కలిసిన కిషన్‌రావు

చేగుంట(తూప్రాన్): మాజీ మంత్రి హరీశ్‌రావును సోమవారం హైదరాబాద్ కోకాపేటలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కిషన్‌రావు దేశ్‌ముఖ్ తెలిపారు. మండలంలోని ఇబ్రహీంపూర్ వేంకటేశ్వర ఆలయ జ్ఞాపికను హరీశ్‌రావుకు అందజేశామన్నారు. మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన కుటుంబీకులు**

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల చెక్ డ్యాంలో లభించిన గుర్తు తెలియని మృతదేహం అచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గత శనివారం ఏడుపాయల చెక్ డ్యాం నీటిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతుందన్న స్థానికుల సమాచారం మేరకు వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి ఆచూకీ కోసం ప్రయత్నించినా దొరకలేదన్నారు. దీంతో పంచనామా నిర్వహించి గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. ఈ క్రమంలో సోమవారం మండల పరిధిలోని నార్సింగి గ్రామానికి చెందిన కుర్మ మల్లేశం కుటుంబీకులు దినపత్రికలో వచ్చిన వార్తను చూసి పోలీసులను సంప్రదించారు. దీంతో మెదక్ ఏరియా ఆస్పత్రిలో ఉన్న మృతదేహాన్ని, దుస్తులను చూసి నార్సింగికి చెందిన కుర్మ మల్లేశం(35)గా నిర్ధారణకు వచ్చి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామన్నారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

◆ **నూతన తహసీల్దార్‌ను కలిసిన సర్పంచ్‌లు**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్‌రెడ్డిని పలు గ్రామాల సర్పంచ్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సోమవారం రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్, పోతారం సర్పంచ్ మాధవరెడ్డి, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేణుకుమార్, కొండాపూర్ ఉప సర్పంచ్‌లు వెంకటేశ్, మహేందర్‌గౌడ్, నాయకులు సత్యనారాయణ, సాయి, తదితరులు కలిశారు.

◆ **అపరిచితుల నుంచి ఫోన్లు కొనొద్దు**

వెల్దుర్తి(తూప్రాన్): అపరిచితులు విక్రయించే మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసి మోసపోవొద్దని ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ..సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరి వద్ద నుంచి సెకండ్‌హ్యాండ్ ఫోన్‌లను కొనుగోలు చేయ్యొద్దన్నారు.

◆ **ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయండి**

టేక్మాల్(మెదక్): ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలని మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రం టేక్మాల్ ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న విధంగా తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈనెల 17 వరకు కంప్యూటరీకరణ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రియాజొద్దీన్ పాల్గొన్నారు.

◆ **అంగవైకల్యం ప్రగతికి అవరోధం కాదు**

పాపన్నపేట(మెదక్): అంగవైకల్యం ప్రగతికి అవరోధం కాదని సీఎంఓ సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం పాపన్నపేటలోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకల్యం ఉన్న వారితో ప్రతీ ఒక్కరు సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. వారిని లక్ష్యం దిశగా ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీ రామకృష్ణ, వీరప్ప, సీఆర్పీ సత్యనారాయణరెడ్డి, టీచర్లు ఉన్నారు.

◆ **10న సామాజిక తనిఖీ ప్రజావేదిక**

రామాయంపేట(మెదక్): మండలంలో గత ఏడాది కాలంగా నిర్వహించిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఈనెల 10న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన ఉపాధి పనులకు సంబంధించి ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

◆ **ఉచిత శిబిరం విజయవంతం**

మెదక్ మున్సిపాలిటీ: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని యశోద ఆస్పత్రి పల్మనాలజీ ఎండీ డాక్టర్ సాయిరెడ్డి తెలిపారు. సోమవారం మెదక్‌లో ఉచిత పల్మనాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264